క్లుప్తంగా

రేపటి నుంచి శనగల కొనుగోలు

పర్చూరు (చినగంజాం): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన శనగలు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 24వ తేదీ నుంచి కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. శనగలను పర్చూరు మార్కెట్ యార్డులో క్వింటాలు రూ.5868లకు కొనుగోలు చేస్తారన్నారు. రైతులు తమ శనగలను ఇంటి వద్దే శుభ్రపరచుకొని రావాలని కోరారు. తేమ 14 శాతంలోపు ఉండాలన్నారు. నిబంధనలకు లోబడి ఉండని సరుకును కొనుగోలు కేంద్రం వద్ద తిరస్కరిస్తారని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నామని మార్క్‌ఫెడ్ డీఎం తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ

మేదరమెట్ల: రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో చదువుతున్న బాలికలకు శనివారం ఉచితంగా సైకిళ్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. మొత్తం 10 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కుల దూషణపై కేసు నమోదు

అద్దంకి: కులం పేరుతో దూషించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఎస్సై అదిలక్ష్మి వివరాల మేరకు.. మండలంలోని శింగరకొండపాలెం గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన కొమరగిరి హనుమంతరావు కుమారుడు దుర్గా ప్రసాద్ కొత్తరెడ్డిపాలేనికి చెందిన కసిరెడ్డి అశోక్‌రెడ్డి వద్ద రూ.150 బాకీ చేశాడు. అశోక్ రెడ్డి శింగరకొండపాలేనికి చెందిన ఓ మహిళ వద్ద అదే కాలనీలో ఉంటున్నాడు. ఈ క్రమంలో తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వమని అశోక్‌రెడ్డి అడిగాడు. దుర్గా ప్రసాద్ మళ్లీ వచ్చి ఇస్తానని చెప్పాడు. అయితే ఎంత కాలం అయింది డబ్బు తీసుకుని అంటూ.. కులం పేరుతో తన కుమారుడిని దూషించినట్లు పోలీస్ స్టేషన్‌లో హనుమంతరావు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అశోక్‌రెడ్డి, పద్మ మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుంటూరు చానల్‌ను పొడిగించాలి

పర్చూరు (చినగంజాం): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. చానల్‌ను పొడిగించేందుకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే సీఎం కార్యాలయం వరకు రైతు పాదయాత్ర నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కొల్లా రాజమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాలకు సాగునీరు, తాగునీరు లభిస్తాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రామన్, మన్నం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

అద్దంకి రూరల్: మండలంలోని మైలవరం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు శనివారం ఆత్మీయ అభినందనలతో పాఠశాలలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన హెచ్ఎం కె. రమేష్‌బాబు, ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, ఆర్ సత్యనారాయణ, టి. అంకమ్మ, యం శారదదేవిలను ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: పేద, ధనిక, కులమత వర్గాలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాలు అందుతున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో మూడో రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని నాయకులు, నియోజకవర్గ నాయకులతో కలసి గడప గడపకు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిపొందిన పథక వివరాల కార్డును అందజేసి ప్రభుత్వ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు బాగుందని చెప్పడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు నేటి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ఏదేదో మాట్లాడుతున్నాయన్నారు. ప్రజల మేలు ఎవరు కోరుతున్నారో.. ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలకు తెలుసునన్నారు. రాబోయే ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెప్పిన వారికి తగిన బుద్ధి చెప్తారన్నారు. మరలా సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఏదో ఒక కోరికతో కల్లోలం సృష్టించాలనే వారికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. మన ప్రభుత్వం చేసిన మంచిని నాయకులు, కార్యకర్తలు అందికీ వివరించాలన్నారు. ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టాలని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జ్యోతి మనుమంతరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మన్నం శ్రీనివాసరావు, నాయకులు, గంగినేని సుబ్బారావు, జ్యోతి హరికృష్ణ, గండు హరికృష్ణ, నర్రా రాఘవరావు, అడుసుమల్లి రామాంజనేయులు, ఎస్సీ కాలనీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, అధికారులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



దగ్గుబాడులో పుస్తకాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



జాగర్లమూడిలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న అమ్మిరెడ్డి

కారంచేడు: జగనన్న ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి నాణ్యమైన విద్యా, బోధన అందుతోందని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు యూపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండో సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని కుంకలమర్రు మెయిన్‌లో హెచ్ఎం పావులూరి శ్రీనివాసరావు, సర్పంచ్ ఈదర సౌందర్య, గుత్తా శ్రీనివాసరావు, స్వర్ణ మెయిన్‌లో శోభాదేవి, కాలువ సెంటర్ ఎన్‌టీఆర్ కాలనీలో రావి పద్మావతి, పీ నాగమణి, బాబూరావులు, ఆదిపూడి మెయిన్‌లో ఎంఈఓ-1 ఎంవీ సత్యన్నారాయణ, ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు, స్వర్ణ వైసీలో మార్తమ్మ, దగ్గుబాడు మెయిన్‌లో హెచ్ఎం భవనం శ్రీనివాసరెడ్డి, సీహెచ్ మహాలక్ష్మమ్మలు, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి ఉన్నత పాఠశాలలో జేవీకేలో భాగంగా సెమిస్టర్-2 పుస్తకాలను బాపట్ల వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం బీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ సంక్షేమం



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న తహశీల్దార్ ప్రభాకరరావు

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శనివారం అద్దంకి మండలంలోని వెంకటాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితం అందజేస్తారన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలతో సంక్షేమ పథకాలు అందని అర్హులు సరైన పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, తహసీల్దార్ సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, మండల, నాయకులు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీరాల టౌన్: పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో అందరికి సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు స్వరమే అందుతున్నాయని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామ పంచాయితీలో జగననన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటుగా ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఈవోఆర్డీ బాపూజీ, నాయకులు రమణారెడ్డి, పి.నాగిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ సురేష్

యద్దనపూడి: రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. శనివారం రాత్రి యద్దనపూడి ఎస్సీ కాలనీలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో వర్గవిబేధాలకు తావివ్వకుండా పని చేయాలని సూచించారు. అనంతరం కార్యకర్తల మధ్య ఉన్న విబేధాలకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రామనాథంబాబు, ఎంపీపీ పులగం రజనీ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలపోగు రాంబాబు, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం, ద్రోణాదుల సర్పంచ్ భాగ్యారావు, యద్దనపూడి వైస్ ఎంపీపీ ఐమాల శ్యాంసన్, గడ్డం మస్తాన్‌వలి, కొణతాల సులేమాన్, సుకుందరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి



విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న జడ్జి సుధా

వేటపాలెం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులు చదువుల్లో రాణించాలని చీరాల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండల పరిషత్ ప్రాంగణలోగల గిరిజన ఆశ్రమ పాఠశాలను జడ్జి శనివారం సందర్శించారు. పాఠశాల్లోని విద్యార్థులు హాజరు పుస్తకాలను పరిశీలించారు. క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో విశ్రాంత అడ్వకేట్ బీ వినీల, సీహెచ్ షిలోక్‌ఆర్క్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

అద్దంకి: మండలంలోని రామాయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలను మైనింగ్ అధికారులు శనివారం అడ్డుకున్నారు. ఒంగోలు మైనింగ్ అధికారులు రామాయపాలెం గ్రామ సమీపంలో ఇసుక తవ్వుతున్న పొక్లెయిన్‌ను గుర్తించి కేసు నమోదుతో పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో గ్రామస్తులు కొందరు గత కొంత కాలంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవటం ఏమిటని అధికారులను ప్రశ్నించారు.

పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో సత్యన్నారాయణ

ఆదిపూడి (కారంచేడు): పాఠశాలల నిర్వహణలో ఉపాధ్యాయులు ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దని ఎంఈఓ-1 ఎంవీ సత్యన్నారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని ఆదిపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, అన్ని రకాల రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు యాప్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కుకింగ్ నిర్వాహకులు ప్రతిరోజు కచ్చితంగా మెనూను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రేణుకాదేవి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: జగనన్న కాలనీల్లో స్థలం మంజూరై లబ్ధిదారులు పక్కా గృహాలను పూర్తిచేయాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మల్లాయపాలెం గ్రామంలోని జగనన్న కాలనీల్లోని లే అవుట్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామానికి 48 గృహాలు మంజూరు కాగా ఇంకా 18 గృహాలు వివిధ దశల్లో ఉండటం, కొన్నింటిని నిర్మాణమే చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల నగదు, ఇసుక అందజేస్తున్నామన్నారు. పూర్తి చేసుకోకుంటే లే అవుట్లో ఉన్న గృహాలు రద్దు అవుతాయని ఎంపీడీవో హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దుర్గా రమేశ్, వీఓఏ పాల్గొన్నారు.

పీఎం యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తులు

చీరాల టౌన్: ప్రధానమంత్రి యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని బీసీ సహాయ సంక్షేమాధికారి ఎస్.రాజేష్‌దాసు శనివారం ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న వెనుకబడిన తరగతులు, సంచార జాతులకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలు ఉన్న వారు ఆగస్టు 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు సహాయ బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రోగులకు ఇచ్చే మందులపై అవగాహన ఉండాలి



రోగులకు మందులు అందజేస్తున్న పవన్

ఇంకొల్లు (చినగంజాం): గ్రామీణ వైద్యులు రోగుల ఇచ్చే మందులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రెడ్డీ ల్యాబొరేటరీ ఏరియా ఫీల్డ్ ఆఫీసర్ ఎం పవన్ అన్నారు. ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఒక రోజు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సీజన్ మారి వర్షాలు తరచూ పడటం వల్ల జలుబు, దగ్గు, జ్వరం పెరిగే అవకాశం ఉన్న కారణంగా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సాధారణ దగ్గు మందులు, షుగర్ వ్యాది ఉన్న వారు వాడే దగ్గు మందులు, చిన్నపిల్లలకు వాడే దగ్గు మందులు వ్యత్యాసం తెలుసుకోవాలని అన్నారు. అనంతరం జలుబు, దగ్గు ఉన్న రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సదస్సులో సొసైటీ ప్రెసిడెంట్ రావి నూతల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నాగజ్యోతి, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ఇంటింటా వైద్యంతో మెరుగైన సేవలు

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యంతో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, చిన్నారులకు ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి భారతి తెలిపారు. శనివారం ముక్తేశ్వరం గ్రామంలో బాలింత ఆమె బిడ్డను పరీక్షించి సూచనలు ఇచ్చారు. పరీక్షల్లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మార్టూరు సమీపంలోని ఇసుక దర్శి శ్రీరంగ క్షేత్రం గుడి వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. అద్దంకి పట్టణానికి చెందిన రాధాకుమారి (55) తన భర్తతో కలిసి గుంటూరు వెళ్లి కారులో తిరిగి అద్దంకి వెళ్లే క్రమంలో ఇసుక దర్శి సమీపంలోని హోటల్లో టిఫిన్ కోసం ఆగారు. అనంతరం రోడ్డు దాటుతున్న రాధా కుమారిని గుర్తుతెలియని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాద తీవ్రతకు రాధా కుమారి శరీరం ఛిద్రమై శరీర భాగాలు విడిపోయి చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆప్రదేశం భయానకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.